# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 20 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## అర్హులందరికీ న్యాయం చేస్తా

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

, రైతు భరోసా నిధులు జమకాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉండి.. బ్యాంకు అంకౌట్లలో డబ్బులు పడని రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మరోవైపు.. రాష్ట్రంలో కొత్తగా భూముల యాజమాన్యం పొందిన రైతులకు కూడా రైతు భరోసాకు అర్హులవుతారని ప్రభుత్వం తెలిపిన విషయం విదితమే. జూన్ 5వ తేదీ వరకు భూమి యాజమాన్య హక్కులు పొందిన రైతులు కూడా ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం పరిగణిస్తుంది. ఈ క్రమంలో ప్రభుత్వం నిర్ణయించిన జూన్ 20వ తేదీ వరకు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలని భావించిన వారు సంబంధిత ఏఈవో దగ్గరకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. జూన్ 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే రైతు భరోసా సాయం అందుతుందని అధికారులు తెలిపారు.

# బనకచర్ల లింక్ ప్రాజెక్టును అడ్డుకోండి

- చట్ట ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి
- కేంద్రం సానుకూలంగా స్పందించకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం
- గోదావరిలో వెయ్యి, కృష్ణాలో 500 టీఎంసీల వినియోగానికి ఎన్ఓసీ ఇవ్వండి
- పెండింగ్ ప్రాజెక్టుల సంగతి చూడండి
- కేంద్ర జలశక్తి మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి – బనకచర్ల ప్రాజెక్టు ప్రీ – ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కోరారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ –1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం –2014 లకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఫిర్యాదు చేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఢిల్లీలో శ్రమశక్తి భవన్‌లో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. బనకచర్లపై అభ్యంతరాలతో పాటు నీటి వాటాలకు సంబంధించి అనేక అంశాలను కేంద్ర మంత్రి గారికి వివరించారు.

“బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోంది. జీడబ్ల్యూడీటీ–1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదు. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలి. బనకచర్ల విషయంలో ఏపీ వీటన్నింటిని ఉల్లంఘిస్తోంది. ఏ నిబంధనలు పాటించకుండా వరద జలాల ఆధారంగా ప్రాజెక్ట్ చేపడుతున్నామని చెబుతుండడం తీవ్ర అభ్యంతరకరం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్లకుండా చూడాలి.

సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టింది. %+ఔఋ% –1980 నిబంధనల ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసింది. పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోంది. తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉంది. జాతీయ ప్రాజెక్టు పోలవరం విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి. గోదావరిలో వరద జలాలున్నాయని నిజంగా ఏపీ భావిస్తే.. పోలవరం – బనకచర్లకు బదులు కేంద్రం నిధులు ఇచ్చి ఇచ్చంపల్లి – నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయంలో చర్చకు తాము సిద్ధం.

కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్–2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలి. తెలంగాణ ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోం. అన్ని వేదికల ద్వారా సమస్యలు సామరస్య పూర్వకంగా పరిష్కారానికి ప్రయత్నిస్తాం. కేంద్ర స్పందన అనుకూలంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం.” అని వివరించారు.

**1500 టీఎంసీలపై వినియోగానికి అనుమతులు ఇవ్వండి..**

తెలంగాణకు గోదావరి నదిలో 1000 టీఎంసీలు, కృష్ణా నదిలో 500 టీఎంసీలు మొత్తంగా 1500 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని, దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. 1500 టీఎంసీల నీటితో కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని, ఆ తర్వాత ఏపీ చేపట్టే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియలో సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదని రేవంత్ రెడ్డి గారు అన్నారు. “ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య పలు అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. పాలమూరు – రంగారెడ్డి, సమ్మక్క– సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు అన్ని రకాల అనుమతులు వెంటనే మంజూరు చేయాలి. గంగా, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించాలి.” అని కోరారు.

తెలంగాణ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సమావేశం అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు మీడియాకు తెలిపారు. బనకచర్లకు సంబంధించిన డీపీఆర్ తమకు అందలేదని కేంద్ర మంత్రి చెప్పారని, త్వరలోనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారని మంత్రి వివరించారు. కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో ఎంపీలు మల్లు రవి , రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇరాన్‌లోని విద్యార్థుల కోసం ‘ఆపరేషన్ సింధు’

- ఇరాన్‌లో చిక్కుకుపోయిన 110 మంది భారతీయ విద్యార్థులను భారత్‌కు తీసుకోచ్చిన కేంద్రం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఇరాన్ నుంచి విద్యార్థులు, పౌరులను సురక్షితంగా భారత్ తరలించింది. అలాగే ‘ఆపరేషన్ సింధు’ కింద ఇజ్రాయెల్ నుంచి భారత పౌరులను తరలించేందుకు భారత్ సిద్ధమైంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ఈ విషయాన్ని గురువారం ప్రకటించింది. ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయ పౌరులు స్వదేశానికి తిరిగి రావాలనుకుంటే టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం సహాయం అందిస్తుందని తెలిపింది.

ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రతరమైన వేళ ఇరాన్‌లో చిక్కుకుపోయిన 110 మంది భారతీయ విద్యార్థులను తొలిదశలో భాగంగా కేంద్రం స్వదేశానికి తీసుకొచ్చింది. ‘ఆపరేషన్ సింధు’ పేరిట భారతీయులను వెనక్కి రప్పించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే 110 మంది విద్యార్థులు స్వదేశానికి చేరుకున్నారు. వీరికి విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ స్వాగతం పలికారు. బుధవారం ఆర్మేనియా రాజధాని యెరవాన్ నుంచి విద్యార్థులంతా ప్రత్యేక విమానంలో బయలుదేరి, గురువారం తెల్లవారుజామున వీరంతా ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే, భారత్‌కు తిరిగివచ్చిన వారిలో 90 మంది జమ్మూకశ్మీర్‌కు చెందినవారే ఉన్నారు.

స్వదేశానికి తిరిగి రావడంపై విద్యార్థులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ తమ చదువు పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ పరిస్థితి దారుణంగా ఉన్నట్లు, ప్రజలంతా భయంతో బతుకుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తమను సురక్షితంగా తీసుకువచ్చిన ప్రధాని మోదీ, భారత విదేశాంగ శాఖకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ దశలోనూ తమకు అండగా నిలిచారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేశానికి తీసుకు వచ్చారని తెలిపారు. ఆ దేశంలో ఉన్న మిగిలిన భారతీయులను కూడా త్వరలోనే తిరిగి తీసుకురావాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇంగ్లీష్ మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి

- కేంద్ర మంత్రి అమిత్ షా




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో ఇంగ్లీష్ భాష మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని కేంద్ర మంత్రి అమిత్ షా అన్నారు. దేశ ఐక్యతలో భారతీయ భాషలు ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఐఏఎస్ ఆఫీసర్ ఆశుతష్ అగ్నిహోత్రి రాసిన మై బూంద్ స్వయం.. కుద్ సాగర్ హు అన్న పుస్తకాన్ని మంత్రి రిలీజ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. భారతీయ భాషల వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన సందర్భంగా వచ్చిందన్నారు. మాతృ భాషలపై గర్వంతో ప్రపంచంలో ముందుకు వెళ్లాలన్నారు. ఈ దేశంలో.. త్వరలో ఇంగ్లీష్ మాట్లాడే ప్రజలు సిగ్గుపడే సందర్భం వస్తుందని, అలాంటి సమాజ ఏర్పాటు ఎంతో దూరం లేదని, పట్టుదలతో మార్పును కోరుకునేవారితో అది సాధ్యం అవుతుందని, మన దేశంలోని భాషలు.. మన సంస్కృతికి రత్నాలని నమ్ముతున్నట్లు చెప్పారు. మన భాషలు లేకుండా మనం ఈ దేశవాసులం కాబోమన్నారు. ఈ దేశాన్ని, సంస్కృతిని, చరిత్రను, మతాన్ని అర్థం చేసుకోవడనానికి ఏ విదేశీ భాష సరిపోదు అని, అసమగ్రమైన విదేశీ భాషలతో సమగ్రమైన దేశభావన రాదు అని, ఇది చాలా సంక్లిష్టమైన అంశమని, కానీ భారతీయ సమాజం దీంట్లో విజయం సాధిస్తుందని ఆశిస్తున్నానని, మరోసారి మన దేశాన్ని మన స్వంత భాషల్లో ముందుకు నడిపిస్తామని అనుకుంటున్నట్లు చెప్పారు.

## మెట్రో ఫేజ్-IIకు అనుమతులు మంజూరు చేయండి

- కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మెట్రో ఫేజ్–IIకు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కి విజ్ఞప్తి చేశారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్–2 అవసరం ఎంతో ఉందని వివరంగా తెలియజేశారు.ముఖ్యమంత్రి గారు ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్ గారితో వారి నివాసంలో సమావేశమయ్యారు. రూ. 24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మెట్రో ఫేజ్–2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని.. సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్–%క్ష్మీక్ష్మీ% ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, ఎంపీలు డాక్టర్ మల్లు రవి గారు, రఘువీర్ రెడ్డి గారు, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి గారు, హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి గారు, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ గారు పాల్గొన్నారు.

## యూకే మాజీ ప్రధానితో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో యునైటెడ్ కింగ్‌డమ్ మాజీ ప్రధాన మంత్రి టోనీ బ్లెయిర్‌గారుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ‘తెలంగాణ రైజింగ్ 2047’ విజన్‌లోని కీలక అంశాలను పంచుకున్నారు. ఈ విజన్ డాక్యుమెంట్‌ను ప్రజా ప్రభుత్వం రెండవ వార్షికోత్సవం సందర్భంగా డిసెంబర్ 9, 2025న అధికారికంగా ఆవిష్కరించనున్నారు. టోనీ బ్లెయిర్ క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత, ప్రపంచ నాయకుల విజన్, వ్యూహరచన, వాటి అమలుకు సహాయపడాలనే లక్ష్యంతో టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్‌ను స్థాపించారు. ప్రజా ప్రభుత్వం రూపొందించిన Telangana Rising విజన్ అమలులో సహకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం, టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రితో పాటు నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , ఎంపీలు డాక్టర్ మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, కార్యదర్శి (సమన్వయం) గౌరవ్ ఉప్పల్ ఉన్నారు. తెలంగాణలో రైతులు, యువత, మహిళలు వంటి విభిన్న వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ కోర్ అర్బన్, సెమీ–అర్బన్, గ్రామీణ ప్రాంతాల వారీగా అభివృద్ధి కోసం సూక్ష్మ ప్రణాళికను సరికొత్తగా రూపొందిస్తున్నట్టు తెలిపారు. సుస్థిరత సూత్రాలతో తెలంగాణ అభివృద్ధి ఎజెండా దృఢంగా ఉందని టోనీ బ్లెయిర్ గారు ప్రశంసించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి ప్రధాన కార్యక్రమాలపై టోనీ బ్లెయిర్‌ప్రత్యేక ఆసక్తిని వ్యక్తం చేశారు.

## నీటిపై రాజకీయాలు వద్దు

**ఏపీ సీఎం చంద్రబాబు**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నీటీపై రాజకీయాలు వద్దని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య వివాదం ముదురుతున్న వేళ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ అనవసరంగా నీటిపై రాజకీయాలు చేయొద్దనీ, సముద్రంలో కలిసిపోయే నీటిని వాడుకోవడం తప్పేమీ కాదని అన్నారు. గోదావరిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయని, అందులో భాగస్వామ్యం ఏపీకీ, తెలంగాణకీ ఉందని అన్నారు. ఈ అంశంపై కేంద్రంతో చర్చించి పరిష్కారం కోరాలనే దిశగా చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. రెండు రాష్ట్రాల ప్రజల అభివృద్ధికే శ్రేయస్సుగా ప్రాజెక్టులపై రాజకీయాలు మానుకోవాలని సూచించారు. జల వివాదాల వల్ల రెండు తెలుగు రాష్ట్రాలకు ఎలాంటి ప్రయోజనం చేకూరదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సముద్రంలోకి వృధాగా పోతున్న నీటిని బనకచర్ల ప్రాజెక్టు ద్వారా వాడుకునే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. తెలుగు రాష్ట్రాలు నెంబర్ వన్ గా ఉండాలన్నదే తన కోరిక అని స్పష్టం చేశారు.



## విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె సైరన్

- యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చిన జేఏసీ నేతలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో సమ్మె సైరన్ మోగింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్టిజన్ కార్మికులు సమ్మె బాట పట్టాలని నిర్ణయించారు. ప్రధానంగా ఆర్టిజన్ కార్మికులకు అర్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలనే డిమాండ్‌ను చాలా కాలంగా ప్రభుత్వం, యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్తున్నా, ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనాలతో కాలం వెళ్లదీస్తున్నారు. దీనితో ఇక సమ్మెబాట పట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ (టీబీఏసీ–జేఏసీ) చైర్మెన్ కే ఈశ్వరరావు నేతృత్వంలో గురువారం విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు సమ్మె నోటీసులు ఇచ్చారు. కేవలం రెండే ప్రధాన డిమాండ్లతో ఈ సమ్మెనోటీసులు ఇచ్చారు. ఆర్టిజన్ల కన్వర్షన్, ఎగ్జిస్టింగ్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలనే డిమాండ్లను నోటీసుల్లో పొందుపర్చారు. టీజీఎస్ జెన్‌కో సీఎమ్‌డీ ఎస్ హరీశ్, టీజీఎస్ ట్రాన్స్‌కో కోజేఎమ్‌డీ (ఎఫ్ఏసీ) సూర్యప్రకాశ్, టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీకి సమ్మెనోటీసులు ఇచ్చారు. జేఏసీ కన్వీనర్ ఏమ్ఏ వజీర్, కో చైర్మెన్లు గాంబో నాగరాజు, బీ నరేందర్, కో కన్వీనర్ కందికొండ వెంకటేష్, జాయింట్ సెక్రటరీలు ఎస్ చంద్రారెడ్డి, కే లింగం, పీ మురళీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పీ కోటి, సలీంపాషా, ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరానికి క్యాబినెట్ ఆమోదం లేకుండా ఉంటుందా?

- నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- మేల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం వంటి పెద్ద ప్రాజెక్టు నిర్మాణం కేబినెట్ ఆమోదం లేకుండా నిర్మించారని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేబినెట్ ఆమోదం లేకుండా కాళేశ్వరం కట్టారని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కేబినెట్ లో చర్చించకుండా ఏ నిర్ణయం తీసుకోలేదని, ఒక వేళ నిర్ణయం తీసుకున్న కేబినెట్ ఆమోదం తీసుకుంటారని, తాను బీజేపీ ఎంపీగా కాకుండా నాటి మంత్రిగా చెబుతున్నానని ఎంపీ ఈటెల స్పష్టం చేశారు. కేబినెట్ ఆమోదం లేకుండా కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టు కట్టిన సంఘటన దేశంలో ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించిన ఈటెల ఇలాంటి కీలక అంశాలపై కేబినెట్ ఆమోదం లేకుండా కేసీఆర్ ఎప్పుడు నిర్ణయాలు తీసుకోలేదని, ఆనాడు కేసీఆర్ కేబినెట్లో ఉన్న ముగ్గురు మంత్రులు ఇప్పుడు మీ సీఎం పక్కనే ఉన్నారని, అవసరమైతే వారిని అడిగితే స్పష్టంగా చెప్తారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సీఎం రేవంత్ రెడ్డికి కౌంటర్ ఇచ్చారు.క్యాబినెట్ ఆమోదం లేకుండా ఇంత పెద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందా అని ఈటెల ప్రశ్నించారు. ఆధారాలు అన్నీ ఇస్తామని స్పష్టం చేశారు. బట్ట కాల్చి మీద వేస్తున్నారని, ప్రతి నిర్ణయం క్యాబినెట్ రాటిఫికేషన్ జరుగుతుందనాఇ, కాళేశ్వరం అన్ని డాక్యుమెంట్స్ మీకు పంపిస్తానని అన్నారు. మీ శాఖలో ఏ నిర్ణయం తీసుకోవాలనుకున్నా క్యాబినెట్ లో పెట్టండి అని కెసిఆర్ చెప్పే వారని, ఇది నిజం కాదంటే తాను దేనికైనా సిద్ధమని ఈటెల సవాల్ విసిరారు. ప్రాజెక్టు నిర్మించడం, అవినీతి వేరువేరుగా చూడాలని, ప్రాజెక్ట్ నిర్మించాలి కానీ వాటిని అడ్డం పెట్టుకుని సంపాదించడాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు నిధులు నియామకాల కోసం సాగిందని, తాను జైళ్లకు పోయిన, రక్తం చిందించి పెట్రోల్ మంటల్లో యువత కాలిపోయింది. ఫలితంగా వచ్చిన తెలంగాణలో ప్రాజెక్ట్ కట్టాలా వద్దా ? అని ప్రశ్నించారు. అనేక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే మొదలు పెట్టారు కానీ పూర్తిచేయలేదని, జలయజ్ఞంలో ప్రాణహిత చేవెళ్ల 5 ఏళ్లలో పూర్తి చేసే ప్రాజెక్ట్ కదా ? ఎందుకు చేయలేదని నిలదీశారు.

కమిషన్ త్వరగా పూర్తి చేసి అవినీతి నిగ్గు తేల్చాలని, బీజేపీ అయితే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తుందన్నారు. బిజెపి ప్రాజెక్టులు కట్టడానికి వ్యతిరేకం కాదని, అధికారం అడ్డం పెట్టుకుని టెండర్ లేకుండా పనులు పంచుకోవడం తప్పు అని, ఎటిఎంగా మార్చుకున్న కల్చర్ ను తప్పు పడుతున్నామని

మిగితా 2వ పేజీలో

## బనకచర్ల వివాదంపై అవగాహన లేని సీఎం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బనకచర్ల వివాదంలో తన అసమర్థతను మరియు అవగాహన రాహిత్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ పై అసత్య ప్రచారం చేస్తున్నారు అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ, “కొంతకాలంగా బనకచర్లను అడ్డుకోండని మేము డిమాండ్ చేస్తే, సీఎం రేవంత్ అఖిలపక్ష ఎంపీల సమావేశంలో బోడి గుండుకు మోకాలుకు లంకె పెట్టినట్లుగా మాట్లాడారు” అంటూ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి బేసిన్లపై అవగాహన లేదని, ఆయన సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్ బనకచర్ల ప్రకాశం జిల్లాలో ఉందని చెప్పడం, నిజానికి అది నంద్యాల జిల్లాలో ఉందని హరీశ్ రావు తెలిపారు. “రేవంత్ రెడ్డి తీరు చూస్తే ఆరు నెలలుగా నడుస్తున్న బనకచర్ల వివాదంపై ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో తెలుస్తోంది” అని వ్యాఖ్యానించారు. “చంద్రబాబు అనే భగవంతుడికి, రేవంత్ అనే భక్తుడికి మధ్య అంబికా దర్బార్ బత్తి ఈ ఆదిత్యనాథ్” అని వ్యాఖ్యలు చేశారు.

గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీల నీళ్లు ఏపీకి ఇవ్వమంటూ రేవంత్ రెడ్డి ఏకపక్షంగా ఎలా చెబుతారని ప్రశ్నించారు. రేవంత్ చేసిన ద్రోహానికి ఉరి తీయటం తప్పుకాదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబును అడుగుదలే కాని కాంగ్రెస్ నేతలకు లేదని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు 968 టీఎంసీల నీరు కేటాయించారనీ, కేసీఆర్ ప్రభుత్వం ఆమోదాలు తెచ్చుకుని 946 టీఎంసీలకు అనుమతులు

మిగితా 2వ పేజీలో

# ఐదెకరాలకు రూ.6,404 కోట్లు జమ

**బలగం టీవీ, హైదరాబాద్**

అన్నదాతల ఖాతాల్లో రైతుభరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఐదు ఎకరాల వరకు ఉన్న 4.43లక్షల వేల మంది రైతులకు రూ.6,404 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19.82 లక్షల ఎకరాలకు రూ.1,189.43 కోట్లు గురువారం జమ చేసినట్టు చెప్పారు. తొమ్మిది రోజుల్లో అర్హులైన రైతులందరికీ రైతుభరోసా ఇచ్చే లక్ష్యంతో నిధులు విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 62 లక్షలా 47వేల మంది రైతులకు కోటి ఆరు లక్షల ఎకరాలకు రూ.6,404 కోట్లు విడుదల చేసినట్టు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా సాయం అందిస్తామని తెలిపారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చొప్పదండి ఎమ్మెల్యే



**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన కుంటల హరీష్ మృతి చెందగా రెండు రోజుల క్రితం స్థానిక నాయకులతో కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించి, రెండు రోజులలోగా కుటుంబాన్ని ఆదుకుంటా అని మాట ఇచ్చారు చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం. ఈ మేరకు ఇచ్చిన మాట ప్రకారం ఆయన గురువారం రోజున స్వయంగా వారి ఇంటికి వెళ్లి లక్ష రూపాయల (1,00,000/-)చెక్కును వారి కుటుంబానికి అందించిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి,సెస్ డైరెక్టర్ కొట్టపెల్లి సుధాకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి,మాజీ ఎంపీపీ బోలుమల శంకర్, తడగొండ మాజీ ఎంపీటీసీ సభ్యులు ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొడగాని వెంకటేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏనుగుల అనిల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుడి శేఖర్ రెడ్డి, మెరుపుల మహేష్,సోషల్ మీడియా ఇంచార్జి శాలివాహన శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు అక్కనపెల్లి ఉపేందర్, సంబ లక్ష్మిరాజం,కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట లచ్చయ్య, ఎండీ హుస్సేన్, మండల శ్రీనివాస్,కొప్పుల నగేష్,కట్ట బాబు, మహేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# టీజీపీఎఫ్‌సీఎల్ ఎండీగా నవీన్ మిట్టల్‌కు బాధ్యతలు

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీపీఎఫ్‌సీఎల్)కు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్‌ను మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ప్రస్తుతం నవీన్ మిట్టల్ కొనసాగుతున్నారు. నిరుడు సైతం ఇంధనశాఖకు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న అధికారినే మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో ప్రభుత్వం నియమిస్తూ వస్తోంది.

## విమాన ప్రమాదంలో 211 మృతుల గుర్తింపు

**బలగం టీవి, హైదరాబాద్**

ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో 270 మంది చనిపోయారు. వారిలో 211 మంది బాధితులను వారి డిఎన్ఎ మ్యాచింగ్‌తో గుర్తించారు. కాగా భౌతికకాయాలలో 189 వారి సంబంధికులకు అప్పగించారు. వాస్తవానికి 242 మంది ప్రయాణికులతో లండన్‌కు బయలుదేరిన ఏఐ 171 విమానం అహ్మదాబాద్‌లోని మెడికల్ కాంప్లెక్స్‌పై జూన్ 12న కూలింది. విమానంలో ప్రయాణించిన ఒక్కరు తప్ప అంతా చనిపోయారు. అది కూలినప్పుడు నేలపైన ఉన్న 29 మంది కూడా మరణించారు. ప్రస్తుతం గుర్తించిన 189 మంది బాధితులలో 142 భారతీయులవి, 32 బ్రిటిష్ పౌరులవి, ఏడుగురు పోర్చుగీస్, ఒకరు కెనడాకు చెందిన వారివి. నేలపై మరణించిన వారిలో ఏడుగురి భౌతిక కాయాలను కూడా వారి బంధువులకు అప్పగించినట్లు అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ జోషి విలేకరులకు తెలిపారు.

## సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీకి ఎప్పుడూ రుణపడి ఉంటాను : నటి జెనీలియా

**బలగం టీవి, హైదరాబాద్**

తెలుగు చిత్రసీమలో బొమ్మరిల్లు, సత్యం, హ్యాపీ, ఢీ, రెడీ, సై వంటి హిట్ సినిమాల ద్వారా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నటి జెనీలియా డెస్ముఖ్, సౌత్ ఇండస్ట్రీపై తనకున్న అభిమానం మరోసారి వ్యక్తపరిచింది. తాజాగా ఆమె ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'సితారే జమీన్ పర్' చిత్రంలో కథానాయికగా రీఎంట్రీ ఇస్తోంది. ఈ చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం జెనీలియా ప్రమోషన్ కార్యక్రమాల్లో బిజీగా ఉంది. ఈ సందర్భంగా ఓ యాంకర్, "మీకు సౌత్ ఇండస్ట్రీలో చెప్పుకోదగ్గ పాత్రలు లభించలేదేమో" అని ప్రశ్నించగా, జెనీలియా స్పందిస్తూ "అలాంటి అనుభవం నాకు ఎప్పుడూ రాలేదు. నేను చేసిన ప్రతి సౌత్ సినిమా నాకు గొప్ప గుర్తింపు ఇచ్చింది. బొమ్మరిల్లు వంటి సినిమాలు నా కెరీర్‌ను మలుపుతిప్పాయి. సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీ నాకు ఎన్నో అద్భుతమైన అవకాశాలు ఇచ్చింది. నేను చేసిన పాత్రలు, అక్కడి ప్రేక్షకుల ప్రేమ, ఆ గుర్తింపు పట్ల నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను." అని పేర్కొంది.జెనీలియా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తెలుగు ప్రేక్షకులు ఇప్పటికీ ఆమెను గుర్తు చేసుకుంటూ అభిమానం చాటుతున్నారు.



## జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం..

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**బలగం టీవీ, బోయినిపల్లి**

జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా అధ్యక్షులు పట్నం ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు గంగాధరలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గురువారం రోజున మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.అనంతరం ఎమ్మెల్యే నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే సన్మానించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జర్నలిస్టుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ: అర్హులైన ప్రతి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయించడంతో పాటు, మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించే విధంగా త్వరలోనే చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నల్లగొండ వేణుగోపాల్, ఉపాధ్యక్షులు గడ్డం తిరుపతి, గజ్జెల శ్రీనివాస్, కార్యదర్శి అతికం రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి కూస రవి, శ్రావణపల్లి గణేష్ లు ఉన్నారు.

## డిగ్రీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్–తెలంగాణ' (దోస్త్) మూడో విడత రిజిస్ట్రేషన్ల గడువును పొడిగిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు మరియు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపళ్ల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మండలి గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. పొడిగించిన గడువు ప్రకారం, అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ వరకు మూడో విడత దోస్త్ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. అదేవిధంగా, ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకునేందుకు కూడా జూన్ 25వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది.

# ఆక్స్‌ఫర్డ్ ఫోరమ్‌లో ప్రసంగించనున్న కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల జూన్ 20–21 తేదీల్లో (నేడు, రేపు) యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రతిష్మాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లో నిర్వహించనున్న ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్‌లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్, "భారత అభివృద్ధికి ఫ్రంటియర్ టెక్నాలజీల పాత్ర" అనే అంశంపై ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగంలో ఆయన తెలంగాణ అభివృద్ధి మోడల్, సాంకేతిక పరిజ్ఞానంను వినియోగించి సాధించిన సమగ్ర అభివృద్ధి, అంతర్జాతీయ పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించిన విధానం వంటి అంశాలను ప్రస్తావించనున్నారు. తెలంగాణ రాష్ట్రం విశిష్ట అభివృద్ధి విధానంతో ప్రపంచంలో అనేక దేశాల దృష్టిని ఆకర్షించగా, ఇప్పుడు ఆ మోడల్‌ను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించనున్న కేటీఆర్ ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.



## మండల స్థాయిలో 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థిని, విద్యార్థుల ఎంపిక పూర్తి

**బలగం టీవీ, బోయినిపల్లి**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలో చేరుటకై 2025–2026 విద్యా సంవత్సరంనకు గాను 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థిని, విద్యార్థుల ఎంపిక నిమిత్తం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నర్సింగపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. ఇట్టి పోటి పరీక్షలకు బాలులు (07) మరియు బాలికలు (01) మొచత్తం 08 మంది హజరు అయినారు. వీరికి పరీక్షలు నిర్వహించి జిల్లా స్థాయి పోటీ పరీక్షలకు పంపనైనది. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్. శ్రావణ్ కుమార్ మరియు వివిధ పాఠశాలల పి.ఈ.టిలు పాల్గొన్నారు.

# కాళేశ్వరానికి క్యాబినెట్ ఆమోదం లేకుండా ఉంటుందా?

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. దమ్ముంటే రిపోర్ట్ మీద చర్యలు తీసుకోవాలని, కుంగి పిల్లర్లు రిపేరు చేసి నీళ్లు ఇవ్వాలని, అవినీతి చేసిన వారిని వదలపెట్టవద్దన్నారు. బనకచర్లలో కూడా తననుబంధనం చేయాలని చూస్తున్నారని, పోతిరెడ్డిపాడు పేరుతో అన్యాయంగా మన నీళ్లను తీసుకుని పోతుంటే దుర్మార్గం అని చెప్పి పులిబిడ్డలా కొట్లాడింది తానేనని, రాజశేఖర్ రెడ్డితో కొట్లాడి జెండాకు ఎక్కింది నేను అవి ఎక్కడికీ పోవు..ఇప్పుడు బదనం చేయాలని చూస్తే ప్రజలు నమ్మరని ఈటెల స్పష్టం చేశారు.

# బనకచర్ల వివాదంపై అవగాహన లేని సీఎం

(మొదటి పేజీ తరువాయి)

సాధించిందని చెప్పారు. కేసీఆర్ జల్ శక్తి మంత్రికి రాసిన లేఖలో 1950 టీఎంసీల నీళ్లు కావాలని పేర్కొన్నారని గుర్తు చేశారు. కానీ రేవంత్ మాత్రం 1000 టీఎంసీలు ఇచ్చి మొత్తం తీసుకోమంటున్నాడని విమర్శలు గుప్పించారు.

"గత 18 నెలల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు" అని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం, సమ్మక్క సాగర్, సీతమ్మ సాగర్ వంటి అనేక ప్రాజెక్టులు నిర్మించారని గుర్తు చేశారు. "కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ పూర్తి చేసి 6.50 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. రేవంత్ ప్రభుత్వం కాలంలో పెద్దవాగు కొట్టుకుపోయింది, ఎస్ఎల్బీసీ కూలింది, వట్టెం పంపు మునిగిపోయింది" అని ఆరోపించారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆరుగురు మంత్రులుగా రాజీనామా చేసిన విషయం గుర్తుచేశారు. "రేవంత్ రెడ్డి పాలన తెలంగాణ ద్రోహ చరిత్ర" అని హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. "కృష్ణా విషయంలోనూ అదే అజ్ఞానం. ఆ జిల్లాలో పుట్టి కృష్ణా నదిపై అవగాహన లేకపోవడం దారుణం. ముఖ్యమంత్రి పక్కన పెట్టు.. జడ్పీటీసీ, ఎమ్మెల్యేగా చేశావు కదా..? అందులో కూడా 500 టిఎంసి ఇచ్చి మొత్తం నీళ్లు తీసుకో అంటడు. రేవంత్ రెడ్డి చేసిన ద్రోహానికి ఉరి తీసిన తప్పులేదు. కేసీఆర్ తెలంగాణ కోసం, నీళ్ల కోసం ఎంతో పోరాటం చేశారు. కేసీఆర్ పాదయాత్ర తర్వాత అప్పటి ప్రభుత్వం దిగివచ్చి ఎడమ కాలువ లిఫ్టులు కూడా కుడి కాలువల మాదిరి ప్రభుత్వమే మెయింటైన్ చేస్తున్నది. అది పోరాడి సాధించిన వ్యక్తి కేసీఆర్. అణువణువు క్షణక్షణం నీళ్ల కోసం తపించిన వ్యక్తి కేసీఆర్. 750 టీఎంసీల నీళ్ళు రావాలని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్రం తరపున వాదించాం. సెక్షన్ 3 కోసం పోరాడిండు కేసీఆర్. కృష్ణాలో తాత్కాలిక ఒప్పందం ప్రకారం మనకు 299 టీఎంసీలే వచ్చాయి. అది ఈ కాంగ్రెస్ దరిద్రం వలనే. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో ప్రాజెక్టులు కట్టకపోవడం వల్ల నీటి కేటాయింపులు చేయకపోవడం వల్ల నిర్ణయం జరిగింది. ఆ పాపం కూడా కాంగ్రెస్‌దే. న్యాయమైన వాటా కోసం సుప్రీం వెళ్ళారు. 763 టీఎంసీ నీళ్ళు రావాలని లాయర్లకు సూచించారు. పోలవరం ద్వారా మళ్ళించే 80 టీఎంసీలలో 45 టీఎంసీలు రావాలని కూడా చేర్చారు. దాని ప్రకారం 75 శాతం డిపెండబిలిటీ కింద 555 టీఎంసీ, 65 డిపెండబులిటీ కింద 43 టీఎంసీ, యావరేజ్ కింద 120 టీఎంసీ, వాటర్ డైవర్షన్ కింద 45 టీఎంసీ అన్ని కలిపి 763 టీఎంసీలు కృష్ణా బేసిన్లో తెలంగాణకు రావాలని ట్రిబ్యునల్ ముందు అఫిడవిట్ ఫైల్ చేసింది. మీరు చెబుతున్నది ట్రిబ్యునల్‌ను ఎఫెక్ట్ చేయదా? 500 చాలు అని ఎలా అంటావు. మన వాదనకు విలువ ఉంటదా? అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు.

# రైతుల ఖాతాల్లో రూ. 99.5 కోట్ల రైతు భరోసా నిధులు జమ

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్నదాతలకు శుభవార్త. రైతు భరోసా పథకం కింద జిల్లా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 99.5 కోట్లకు పైగా నిధులు జమ అయ్యాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు రోజులుగా ఈ నిధుల జమ ప్రక్రియ కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. ఖరీఫ్ వానాకాలం సీజన్ సాగుకు రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద ఈ నిధులను విడుదల చేసిందని కలెక్టర్ వివరించారు. ఈ రోజు (గురువారం) నాటికి జిల్లాలోని మొత్తం 13 మండలాల పరిధిలో 1,10,322 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 99,52,19,906 జమ అయ్యాయని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

# మృత్యువుతో పోరాడుతున్న మూడేళ్ల బాలుడు..

- వైద్యం చేయిస్తే బతికేందుకు అవకాశం
- ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



సిరిసిల్ల పట్టణం, బీవైనగర్‌కు చెందిన గూడూరి శేఖర్–సంజన దంపతుల మూడేళ్ల కుమారుడు మనీష్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. జాండీస్ కారణంగా మనీష్ కాలేయం పూర్తిగా దెబ్బతిని, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా, కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) అవసరమని, దీనికి దాదాపు రూ. 25 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. మనీష్ తల్లి బీడీ కార్మికురాలు కాగా, తండ్రి ప్రైవేటు ఉద్యోగి. ఇప్పటికే రూ. 4 లక్షలు అప్పు చేసి ఆసుపత్రిలో చెల్లించారు. ఇప్పుడు మరో రూ. 21 లక్షలు అవసరం కావడంతో ఆ మొత్తాన్ని భరించలేని నిస్సహాయ స్థితిలో ఆ తల్లిదండ్రులు ఉన్నారు. తమ బిడ్డ ప్రాణాలు నిలబెట్టేందుకు దాతలు, ప్రభుత్వ అధికారులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థలు ఆర్థిక సహాయం అందించాలని వారు వేడుకుంటున్నారు. ఆర్థిక సహాయం చేయాలనుకునేవారు మనీష్ తండ్రి శేఖర్‌ను 9441161257 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించవచ్చు.

# ప్రతి రోజు యోగా సాధనతో ఆరోగ్యం..

**-యోగా శిక్షకులు శ్రీనివాస్, స్వప్న**

**-ఐడీఓసీలో దశాబ్ది ఉత్సవాలు**

**బలగం టీవీ, సిరిసిల్ల**



నిత్యం యోగా సాధనతో ఆరోగ్యంగా ఉంటారని ఆయుష్ యునాని డిస్పెన్సరీ యోగా శిక్షకులు బీ శ్రీనివాస్ టీ స్వప్న పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగ దశాబ్ది ఉత్సవాలు కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఉదయం కామన్ యోగా ప్రోటోకాల్ పై జిల్లా అధికారులు, సిబ్బందికి ఆయుష్ యునాని డిస్పెన్సరీ యోగా శిక్షకులు బి శ్రీనివాస్ టి స్వప్న యోగ ఆసనాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యోగా ఆసనాలు, ప్రాణాయామం ముద్రలు ధ్యానము తదితర అంశాలపై వివరిస్తూ..చేయించారుప్రతి రోజు యోగా చేయడం వలన కలిగే లాభాలు, ఆరోగ్యం ఆనందం ఎలా పొందవచ్చు వంటి వివరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు , సిబ్బంది, కలెక్టరేట్ కార్యాలయ ఏవో రామ్ రెడ్డి, ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శశి ప్రభ, డాక్టర్ సౌమిని, డాక్టర్ శ్వేత, డాక్టర్ స్వరూప ,డాక్టర్ కళ్యాణి, డీపీఎం తిరుపతి ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# “రైలుబడి” పాఠశాలలో “నోట్‌బుక్స్” పంపిణీ..

**బలగం టీవీ, కందికట్కూరు**

మానకొండూరు శాసన సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా మెగాలైట్ ఇండస్ట్రీస్ ప్రొప్రైటర్ మొలుగూరి రాజు కందికట్కూరులోని రైలుబడి ఎంపీపీఎస్ (ఎస్సీ కాలనీ) పాఠశాలలో విద్యార్థులకు లాంగ్ నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ నోట్‌బుక్ పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బిగుళ్ళ విజయ్, మహిళా మండల అధ్యక్షురాలు వెలిచాల జ్యోతి గారు, మాజీ ఎంపీటీసీ యాస తిరుపతి గారు, యువజన కాంగ్రెస్ నాయకులు రోండ్ల కరుణాకర్ రెడ్డి, ఏనుగుల నవీన్ కుమార్, బిగుళ్ళ శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు అనవోజు రాజు, మహిళా గ్రూప్ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి...

- మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చర్యలు తప్పవు...
- ఎస్పీ మహేష్ బి. గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



జిల్లా వ్యాప్తంగా ప్రతి శుక్రవారం సాయంత్రం 6 గంటల నుండి 08 గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టడం జరుగుతుదని, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలు శిక్షలు జరిమానలు తప్పవని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఎస్పీ మహేష్ బి. గితే సమీక్ష సమావేశం నిర్వహించినారు. ఈసందర్భంగా ఎస్పీ ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ లో ఉన్న కేసులలో త్వరగా పరిశోధన పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలి అని పెండింగ్ కేసులలో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు ఛేదించాలని, రౌడీ,హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం నిఘా, పర్యవేక్షణ ఉంచాలని , ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి హిస్టరీ షీట్స్ ఓపెన్ చేయాలనీ అధికారులను ఆదేశించారు.

ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలనిఅన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరగా ఎగ్జిక్యూట్ చేయడం వల్ల కేసు విచారణ విజయవంతంగా పూర్తి అయి సకాలంలో బాధితులకు న్యాయం జరుగుటకు ఆస్కారం వుంటుందని అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ తరుపున ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందులో భాగంగా ఈ సమావేశంలో సిఐ లు కృష్ణ,మొగిలి, శ్రీనివాస్,వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# అసమానతలు రూపుమాపడానికి రాహుల్ గాంధీ పాదయాత్ర

**-ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



దేశంలోని అసమానతలు రూపుమాపడానికి రాహుల్ గాంధీ ఎంతగానో కృషి చేశారని,ప్రపంచంలో ఎవరికీ సాధ్యం కానీ విధంగా రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు.వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో వేములవాడ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ గారి పుట్టిన రోజు వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు.ఈ సందర్బంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ గత శాసన సభ ఎన్నికల కంటే ముందు వేములవాడ నియోజకవర్గానికి రెండూ సార్లు రావడం జరిగిందని,రోడ్డు షో లో మేడిపల్లి మండల కేంద్రానికి ఒకసారి, ఎన్నికలప్పుడు వేములవాడ పట్టణానికి మరో మారు రావడం జరిగిందని అన్నారు.నా గెలుపు కోసం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రజలను చైతన్య పరుస్తూ వారి ఆశీర్వాదాలు అందజేశారని అన్నారు.

రాహుల్ గాంధీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు పోతున్నామని అన్నారు. కాశ్మీరు నుండి కన్యకుమారి, ముంబై నుండి మేఘాలయ వరకు పాదయాత్ర చెసి దేశంలోని పేద ప్రజల స్థితి గతులను చూశారని,దేశంలో అసమానతలు తొలగించలని దేశ వ్యాప్తంగా కుల గణన చేయాలని సంకల్పించారని అన్నారు. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో కుల గణన చేపట్టడం జరిగిందని, కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన మాట ప్రకారం బిసి రిజర్వేషన్ల అమలు చేయడం జరుగుతుందని,భవిష్యత్తు లో వారి నాయకత్వంలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముందుకు పోతమన్నారు.



**కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా స్థానిక సంజీవయ్య నగర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. రాపెల్లి కళ్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కటింగ్ చేసి, విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, పిసిసి కోఆర్డినేటర్ సంగీత శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు,రెడ్డి మల్ల భాను, గుడిసె ప్రభాకర్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

# మహిళల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు..

**-మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా పోలీస్ లను సంప్రదించండి.**

**-మానవ అక్రమ రవాణా, మహిళలను, చిన్న పిల్లలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు.**

**-యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ నటేష్..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణంలోని అపారెల్ పార్క్‌లో పనిచేస్తున్న మహిళలకు జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) మరియు షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ నటేష్ మాట్లాడుతూ, మహిళలు మరియు చిన్న పిల్లల రక్షణ విషయంలో జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలో మానవ అక్రమ రవాణాను నిర్మూలించడానికి ఏహెచ్‌టీయూను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. మహిళలపై లైంగికదాడి, అసభ్యంగా దాడి చేయడం, అనుచితంగా తాకడం వంటి లైంగిక నేరాల కేసులలో మరియు మానవ అక్రమ రవాణాను నిరోధించడంలో ఏహెచ్‌టీయూ ప్రత్యేకత కలిగి ఉందని నటేష్ వివరించారు.

మహిళా భద్రత కోసం షీ టీమ్‌ల ఏర్పాటు ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థినులు, యువతులు, మహిళలకు నిరంతరం అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు. నేరుగా సంప్రదించలేని వారు డయల్ 100, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ 87126 56392, లేదా జిల్లా షీ టీమ్ 87126 56425 నంబర్లకు సమాచారం ఇవ్వగలరని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. మానవ అక్రమ రవాణా, మహిళలను, చిన్న పిల్లలను వేధించిన వారిపై కఠిన చర్యలు తప్పవని నటేష్ హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ సిబ్బంది మరియు షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి 2027 గద వేట

- డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్‌లో పోరు ప్రారంభించనున్న భారత్
- నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు

**బలగం టీవీ, లీడ్స్**

ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 సైకిల్‌లో భాగంగా భారతదేశం-ఇంగ్లాండ్‌ల మధ్య ఐదు టెస్టుల సిరీస్‌కు శుక్రవారంతో తెరలేపనుంది. తొలి మ్యాచ్ జూన్ 20న లీడ్స్‌లోని హెడ్డింగ్‌లే క్రికెట్ మైదానంలో ప్రారంభం కానుంది. మునుపటి సార్ల మాదిరిగానే ఈసారి కూడా టెస్టు క్రికెట్‌కు ప్రత్యేక ఆదరణ లభించనున్నది. రెండు దేశాల మధ్య జరిగే ప్రతి టెస్టు సిరీస్‌కు గల ప్రాధాన్యం తెలిసిందే. ఈ సారి డబ్ల్యూటీసీ పాయింట్ల సమీకరణలో ముందంజ వేయాలనే కాంక్షతో ఇరుజట్లు బరిలోకి దిగనున్నాయి. రెడ్ బాల్ క్రికెట్‌లో అత్యంత అనుభవజ్ఞులైన భారత, ఇంగ్లండ్ జట్లు ప్రతిష్టాత్మక పోరుకు సిద్ధమయ్యాయి.

ఈ మ్యాచ్‌ను భారత అభిమానులు శుక్రవారం మధ్యాహ్నం 3:30 గంటల నుండి సోనీ స్పోర్ట్స్ టెన్ 1, టెన్ 5 చానళ్లలో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. ఆన్‌లైన్ స్ట్రీమింగ్ కోసం జియో సినెమా, హాట్‌స్టార్ యాప్‌లలో ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుంది.



రోహిత్ వారసునిగా కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్న గిల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. కోహ్లీ నిష్క్రమణతో ఖాళీ అయిన కీలకమైన నాలుగో స్థానాన్ని భర్తీ చేయడంతో పాటు సెషన్ సెషన్‌కు మారే టెస్టులో ఎప్పటికప్పుడు వ్యూహాలు రచించాల్సిన అవసరం ఏర్పడనుంది. పేస్‌కు స్వర్గధామమైన ఇంగ్లండ్ పిచ్‌లపై బ్యాటింగ్ ఒక రకంగా కత్తిమీద సాము లాంటిదే. ఊరించే బంతులను వేటాడుతూ షాట్లు ఆడితే మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఇదిలా ఉంటే తొలి టెస్టుకు తుది కూర్పుపై ఆసక్తి కొనసాగుతూనే ఉన్నది. ఇంగ్లండ్ ఇప్పటికే తమ ఫైనల్ లెవన్‌ను ప్రకటించగా, టీమ్‌ఇండియా మల్లగుల్లాలు పడుతున్నది. ఓపెనర్లుగా జైస్వాల్, రాహుల్ ఖరారు కాగా, మూడో స్థానంలో సాయి సుదర్శన్, కరణ్ నాయర్‌పై సందిగ్ధత కొనసాగుతున్నది. నాలుగులో గిల్, ఐదులో పంత్ బ్యాటింగ్‌కు రానున్నారు. పిచ్‌ను బట్టి పేస్ ఆల్‌రౌండర్లు శార్దుల్ ఠాకూర్, నితీశ్‌కుమార్‌రెడ్డి ఇద్దరిని ఆడించే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ కనిపిస్తున్నది. బుమ్రా, సిరాజ్ పేస్‌బౌలింగ్‌కు సారథ్యం వహించనుండగా, మూడో పేసర్‌గా ప్రసిద్ధ్ కృష్ణ, అర్షదీప్‌సింగ్‌లో ఎవరికి బెర్తు దక్కుతుందో చూడాలి. ఏకైక స్పిన్నర్‌గా జడేజా తుది జట్టులో ఉండే చాన్స్ ఉంది.

**ఇంగ్లండ్ తుది జట్టు ఇదే..**

ఈ మ్యాచ్‌కు బరిలోకి దిగే తుది జట్టును ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) ఇప్పటికే ప్రకటించింది. 11 మంది సభ్యుల వివరాలను వెల్లడించింది. బెన్ స్టోక్స్ సారథ్యంలో బరిలోకి దిగనుంది. భారత్ తమ తుది జట్టును ఇంకా ప్రకటించలేదు. టాస్ సమయంలోనే వెల్లడించే ఛాన్స్ ఉంది.

ఇంగ్లండ్: జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్(కీపర్), బెన్ స్టోక్స్(కెప్టెన్), క్రిస్ వోక్స్, జోష్ టోంగ్, బ్రైటన్ కార్స్, షోయబ్ బషీర్.

భారత్ తుది జట్టు(అంచనా): యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్(కెప్టెన్), కరుణ్ నాయర్, రిషభ్ పంత్(కీపర్), రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, మహమ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిధ్ కృష్ణ.



**కెట్ ప్రపంచంలో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక టెస్ట్ సిరీస్ ట్రోఫీకి దిగ్గజ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, జేమ్స్ ఆండర్సన్‌ల పేర్లను పెట్టారు. ఇప్పటివరకు పటౌడీ ట్రోఫీగా పిలవబడుతున్న ఈ సిరీస్‌ను ఇకపై 'ఆండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ'గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సంయుక్తంగా ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభానికి ముందు ఈ ప్రకటన వెలువడింది. ఈ మేరకు ట్రోఫీని సచిన్, ఆండర్సన్‌లు ఆవిష్కరించారు.**

## నేటి నుంచి జాతీయ జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్

**బలగం టీవీ, హైదరాబాద్**




రోహ్‌తక్ వేదికగా శుక్రవారం నుంచి 6వ జాతీయ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ మొదలుకానుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 640 మందికి పైగా బాక్సర్లు టోర్నీలో పోటీపడే అవకాశముంది. మొత్తం 13 విభాగాల్లో బాలురు, బాలికలు బరిలోకి దిగనున్నారు. బాలుర కేటగిరీలో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు, బాలికల విభాగంలో హర్యానా డిఫెండింగ్ చాంపియన్లుగా తమ టైటిళ్లను నిలబెట్టుకునేందుకు పట్టుదలతో ఉన్నాయి. జాతీయ టోర్నీ ద్వారా ప్రతిభ కల్గిన బాక్సర్లు వెలుగులోకి వచ్చే అవకాశముందని బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు అజయ్‌సింగ్ పేర్కొన్నాడు.




## ఆసియా స్క్వాష్ చాంపియన్‌షిప్ సెమీ ఫైనల్లో వెలవన్ సెంటిల్‌కుమార్

**బలగం టీవీ, కౌలాలంపూర్**

భారత స్క్వాష్ క్రీడాకారుడు వెలవన్ సెంటిల్‌కుమార్ ఆసియా స్క్వాష్ చాంపియన్‌షిప్ 2025 సెమీ ఫైనల్లో ప్రవేశించాడు. మలేసియాలోని కౌలాలంపూర్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో స్థానిక క్రీడాకారుడు జోఆచిమ్ చువాను స్ట్రెయిట్ గేమ్స్‌లో 3-0 (11-7, 11-6, 11-6) తేడాతో ఓడించాడు. ప్రస్తుతం పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 45వ స్థానంలో ఉన్న సెంటిల్‌కుమార్, వరల్డ్ నెం. 196 అయిన చువాను ఓడిస్తూ సెమీ ఫైనల్ చేరాడు. ఈ విజయంతో కనీసం కాంస్య పతకం సెంటిల్‌కుమార్ ఖాయం చేసుకున్నాడు. ఎందుకంటే సెమీ ఫైనల్‌లో ఓడిన ఇద్దరు క్రీడాకారులకూ కాంస్య పతకం లభిస్తుంది. సెమీ ఫైనల్లో సెంటిల్‌కుమార్, హాంగ్ కాంగ్ చైనా నుంచి వచ్చిన రెండో సీడ్ క్రీడాకారుడు లావ్ జీక్వాన్‌ను ఎదుర్కొననున్నాడు. గత సారి 2023లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో సెంటిల్‌కుమార్ రజత పతకం సాధించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఫైనల్‌లో మలేసియాకు చెందిన ఎన్ ఈన్ యో వద్ద ఓడిపోయాడు. ఇప్పటివరకు ఈ టోర్నీ లో సెంటిల్‌కుమార్ ఒక్క గేమ్ కూడా కోల్పోలేదు. తొలి రౌండ్‌లో బై పొందిన ఆయన, ఆ తర్వాత చైనా ప్రతినిధి లీ హైజెన్, జపాన్‌కు చెందిన టోమోటక ఎండోలను స్ట్రెయిట్ గేమ్స్‌లో ఓడించాడు. ఇప్పటికీ ఈ టోర్నీ లో పోటీ కొనసాగిస్తున్న ఏకైక భారత స్క్వాష్ క్రీడాకారుడు సెంటిల్‌కుమారే. ఇదిలా ఉంటే, దివార్కర్ సింగ్, రాహుల్ బైథా రౌండ్ ఆఫ్ 32లోనే వెనుదిరిగారు. సురాజ్ చంద్ ప్రీ క్వార్టర్స్‌లో ఓడిపోయాడు. మహిళల విభాగంలో పూజార్థి రఘు, అంక్ష సలోంకే, షమీనా రియాజ్ రెండో రౌండ్‌లోనే నిష్క్రమించారు. భారత యువ స్క్వాష్ స్టార్ అనాహత్ సింగ్ సింగిల్స్‌లో ఈసారి పాల్గొనలేదు. అయితే వచ్చే వారంలో ప్రారంభం కానున్న ఆసియా డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో ఆమె ప్రాతినిధ్యం వహించనుంది.

## పెద్దిలో రామ్ బుజ్జిగా.. దివ్యేందుశర్మ

**బలగం టీవీ, హైదరాబాద్**



రామ్‌చరణ్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది'. 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఈ చిత్రంలో 'రామ్ బుజ్జి'గా పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు 'మీర్జాపూర్' సిరీస్ ఫేం దివ్యేందుశర్మ. గురువారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ సినిమాలోని ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఓ స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. క్రికెట్ బంతిని ఎగరేస్తూ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న దివ్యేందుశర్మను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ప్రస్తుతం ఈ సినిమా షఉటింగ్ శరవేగంగా జరుగుతున్నది. హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్లో భారీ ట్రైన్ యాక్షన్ ఎపిసోడ్‌ని షఉట్ చేస్తున్నారు. మైండ్‌బ్లోయింగ్ యాక్షన్ సీక్వెన్స్ ఈ సినిమాలో మేజర్ హైలైట్ కానున్నాయని మేకర్స్ చెబుతున్నారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కమార్, జగపతిబాబు ఇతర కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్.




## రాజీవ్ గాంధీ హత్యపై వెబ్ సిరీస్..

**బలగం టీవీ, హైదరాబాద్**

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య ఘటనపై ఇప్పటివరకు బాలీవుడ్‌తో పాటు సౌత్‌లో చాలా సినిమాలు వచ్చిన విషయం తెలిసిందే. బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహాం కూడా మద్రాస్ కేఫే అంటూ సినిమాను తీశాడు. అయితే రాజీవ్ గాంధీ హత్య కేసుపై తాజాగా ఒక వెబ్ సిరీస్ రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక సోనీ లివ్‌లో 'ది హంట్' అనే పేరుతో ఈ సిరీస్ రాబోతుండగా.. ది రాజీవ్ గాంధీ అసాసినేషన్ కేస్ అనేది ఉపశీర్షిక. నగేశ్ కుకునూర్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో అమిత్ సియాల్, సాహిల్ వైద్, భగవతీ పెరుమాళ్ తదితరులు నటించారు. జులై 4 నుంచి ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. రాజీవ్ గాంధీ హత్య అనంతరం జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది.




## మెగాస్టార్-చిరంజీవి మూవీ ముస్సోరీ షెడ్యూల్ పూర్తి

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి తన 157వ సినిమా చిత్రీకరణలో జోరు చూపిస్తున్నారు. ప్రస్తుతం 'మెగా 157' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్ మీదున్న ఈ సినిమాకు సంబంధించి ఓ కీలక అప్‌డేట్ అందింది. ముస్సోరీలోని సుందరమైన ప్రదేశాలలో జరుగుతున్న రెండవ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయినట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. దీంతో సినిమా మరో ముఖ్యమైన ఘట్టాన్ని పూర్తి చేసుకుంది. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్రాన్ని పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ముస్సోరీ షెడ్యూల్‌లో చిరంజీవితో పాటు ఇతర ప్రధాన తారాగణంపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇటీవలే నయనతార కూడా ఈ షెడ్యూల్‌లో పాలుపంచుకున్నారు. హీరో, హీరోయిన్లపై కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు, ఓ ప్రత్యేక గీతాన్ని కూడా ఇక్కడ చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ముస్సోరీ షెడ్యూల్ పూర్తి కావడంతో, తదుపరి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రారంభించేందుకు చిత్ర బృందం సన్నద్ధమవుతోంది. "2026 సంక్రాంతికి మెగా 157తో వినోదం పంచడానికి సిద్ధంగా ఉన్నాం. తదుపరి షెడ్యూల్‌ను ఉత్సాహంగా ప్రారంభించేందుకు ఎదురుచూస్తున్నాం" అని దర్శకుడు అనిల్ రావిపూడి సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.